సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 29 । జనవరి । 2023



డ్రాపవుట్స్‌పై ఫోకస్
పాఠశాలల్లో డ్రాపవుట్స్ నివారణపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. 10లో



పల్లవికి స్వర్ణం
ఆల్‌ఇండియా ఇంటర్‌వర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పల్లవి స్వర్ణం సాధించింది. 8లో



తుదిపోరుకు జూనియర్స్
'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ జూనియర్స్ జట్లు తుదిపోరుకు సిద్ధమయ్యాయి. 10లో

న్యూస్‌రీల్

31న ఏయూలో జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్, ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈనెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం చీఫ్ ఆచార్య పి.అర్జున్ తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు.బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సు పూర్తి చేసిన పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూనియర్ కెమిస్ట్‌కు నెలకు రూ.19,474, సీనియర్ కెమిస్ట్‌కు వార్షిక వేతనంగా రూ3.5 లక్షలు అందిస్తారు. మొత్తం 250 జూనియర్ కెమిస్ట్, 75 సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాలను భర్తీ చేయడం చేస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు 0891 2844185, 96660 92491 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం

కొమ్మాది: రుషికొండ ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ భవన్‌లో ఆదివారం నుంచి విశాఖ యువ కేంద్ర ఆధ్వర్యంలో 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ప్రారంభం కానున్నట్లు కేంద్ర డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు తెలిపారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

31న డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఉపాధి కల్పన మిషన్ (సీడాప్), దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంలో భాగంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నవత ట్రాన్స్‌పోర్ట్, సాయిప్రియ రిసార్ట్స్, పేటీయం సర్వీసెస్, గ్రీన్ పార్కు హోటల్ వంటి 16 ప్రముఖ కంపెనీల్లో 485 ఉద్యోగాల భర్తీకి ఈ ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత గల నిరుద్యోగులు అర్హులు. ఆరోజు ఉదయం 10 గంటలకు పెందుర్తిలోని ఎస్‌ఆర్‌టీపీ ట్రైనింగ్ సెంటర్‌లో వారి అర్హత పత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు 73867 13880లో సంప్రదించవచ్చు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమోకు ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమో కోర్సులో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బీరేంద్ర సింగ్ తెలిపారు. ఏడాది కాలవ వ్యవధితో నిర్వహించే ఈ కోర్సులో ప్రవేశాలకు ఫిబ్రవరి 10వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో ప్రవేశాలకు అర్హులు. పూర్తి వివరాలకు ఆర్ట్స్ కళాశాల భవనంలోని సంస్థ కార్యాలయంలో, ఏయూ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.inను సంప్రదించాలి. ఇతర సమాచారం కోసం 6372664954, 81061 35678లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలకు అభినందనలు



విజేతలతో ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులను ఆర్‌ఐవో ఆర్. సత్యనారాయణ అభినందించారు. ప్రతిభ గల క్రీడాకారులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా తగిన ప్రోత్సాహం అందిస్తామని ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాంబాబు తెలిపారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఇటీవల నిర్వహించగా, ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతభ కనబరిచి పతకాలను సాధించారన్నారు.

• నమో సూర్యదేవా



• ఆదిత్యుడికి అభివందనం



ప్రత్యక్ష భగవానుడు, సర్వమానవాళికి ఆరోగ్యప్రదాత అయిన సూర్యదేవుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. రథసప్తమి సందర్భంగా శనివారం ప్రత్యేక అర్చనలు చేశారు. సింహగిరిపై సూర్యప్రభ వాహనంపై తిరువీధిలో సూర్యభగవానుడిగా అప్పన్న దర్శనమిచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. క్లిష్టమైన ఆసనాలను వేసి చిన్నారులు అబ్బురపరిచారు. 10లో

ఇక అద్దంలా రహదారులు



ఆనందపురం మండలం మామిడిలోవలో పాడైన రోడ్డు

- ఉమ్మడి విశాఖలో మరమ్మతులకు రూ.71 కోట్లు
- ఇప్పటికే 'అల్లూరి' జిల్లాలో టెండర్లు పూర్తి
- త్వరలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఖరారు
- జూన్‌లోగా తారు రోడ్ల రిపేర్ల పూర్తికి సన్నాహాలు
- 903 గ్రామాలకు ప్రయోజనం

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోడ్ల మరమ్మతుల వివరాలు ఇలా..

జిల్లా	రోడ్ల సంఖ్య	పొడవు (కి.మీల్లో)	మొత్తం సొమ్ము (రూ. లక్షల్లో)
అనకాపల్లి	154	352.12	3,229.99
విశాఖపట్నం	36	70.08	382.50
అల్లూరి	69	251.98	3,589.97
మొత్తం	259	674.18	7,171.46

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్లు కొత్త అందాన్ని సంతరించుకోనున్నాయి. మరమ్మతులకు గురైన ఈ తారు రోడ్లు అద్దాల్లా త్వరలో రూపుదిద్దుకోనున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఈ శాఖ పరిధిలో 259 రోడ్లున్నాయి. వీటిలో 674.18 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా రోడ్లపై ప్రయాణాలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వీటికి మరమ్మతులు చేపట్టడానికి రూ.71.71 కోట్లు మంజూరు చేసింది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ మొదలైంది.

అల్లూరి జిల్లాలో..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో టెండర్లు పూర్తయ్యాయి. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో టెండర్లు పురోగతిలో ఉన్నాయి. త్వరలోనే ఇవి ఖరారు కానున్నాయి. అనంతరం వీటి పనులు ప్రారంభించనున్నారు. తొలుత చిన్న చిన్న గోతులను పూడ్చడానికి ప్రాధాన్యమిస్తారు. ఇలాంటి రోడ్లు ఈ మూడు జిల్లాలో 413.67 కిలోమీటర్ల మేర ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. ఆ వెంటనే భారీగా గోతులు పడిన రోడ్లను పటిష్టవంతంగా మరమ్మతులు చేపడతారు. ఈ తరహా రోడ్లు 260.51 కిలోమీటర్ల మేర ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి.

జంగిల్ క్లియరెన్స్..

రోడ్ల మరమ్మతులతో పాటు రోడ్లకిరువైపులా దట్టంగా అలముకున్న మొక్కలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మరమ్మతుల్లో భాగంగా వీటిని కూడా (జంగిల్ క్లియరెన్స్) తొలగించనున్నారు. ఇలా ఒకపక్క రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు, మరోపక్క జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం ద్వారా మూడు జిల్లాల్లోని పంచాయతీ రాజ్ రోడ్లు అద్దాల్లా రూపుదిద్దుకోనున్నాయి. ఈ రోడ్లకు మరమ్మతులు పూర్తయితే 903 గ్రామాల పరిధిలోని 63,828 మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

జూన్‌లోగా మరమ్మతులు పూర్తి



ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.71 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ల పక్రియ మొదలవుతుంది. టెండర్లు ఖరారు కాగానే మరమ్మతులు ప్రారంభమవుతాయి. జూన్‌లోగా వీటికి పూర్తి స్థాయిలో రిపేర్లు పూర్తి చేస్తాం.
– బీఎస్ రవీంద్ర, ఎస్‌ఈ, పంచాయతీరాజ్ శాఖ

చదువుతోనే రాణింపు : కలెక్టర్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): చదువుతోనే రాణింపు సాధ్యమని విశాఖ వ్యాలీ స్కూల్ స్కూల్ చైర్మన్, కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శనివారం స్కూల్ వార్షికోత్సవాన్ని గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హాయిగా విద్యనభ్యసించే వెసులుబాటు కలిగించే విధంగా పాఠశాల విద్యా విధానం ఉండడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులతో సమయాన్ని గడపాలన్నారు. వివిధ పోటీల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. స్కూల్ విస్తరణలో భాగంగా 42 గదులతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల సౌకర్యార్థం పాఠశాల ఆంగ్ల పత్రిక విక్యూబ్‌తో పాటు ఎంసీబీ కొత్త యాప్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్, స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

పరిశోధనలతో ప్రగతి

ఏయూను సందర్శించిన ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బి.ప్రశాంత్ కుమార్ పాత్రో సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూతో సంయుక్తంగా కలసి పనిచేయాలని వీసీ ఆహ్వానించారు. రెండు సంస్థలు సమష్టిగా పనిచేస్తూ పరిశోధన రంగంలో మరింత ప్రగతి సాధించడం వీలవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకునే అంశాలపై చర్చించారు. ఏయూలో ఎన్‌జీఆర్‌ఐ తరఫున చెయిర్ ప్రొఫెసర్‌ను ఏర్పాటు చేయాలని వీసీ సూచించారు. మూడేళ్ల కాలానికి దీనిని ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఏయూలో పదుల సంఖ్యలో చెయిర్ ప్రొఫెసర్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ దిశగా ఆలోచన చేయాలని ప్రశాంత్ కుమార్ పాత్రోను కోరారు. ఎన్‌జీఆర్‌ఐతో కలసి పనిచేయడానికి ఏయూ సిద్ధంగా ఉందని, సంయుక్తంగా పనిచేయడానికి అనువైన రంగాలను గుర్తించాలని సూచించారు. వర్సిటీ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్‌ను ఏయూ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్త ప్రశాంత్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

న్యాయవాదుల సంఘం ఎన్నికలపై
లోక్ అదాలత్‌లో ఫిర్యాదు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికల నిర్వహణ కోసం సీనియర్ న్యాయవాది ఐ.ఎం అహ్మద్ లోక్ అదాలత్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేశారు. ప్రస్తుత కమిటీ వార్షిక ఎన్నికలను ఆలస్యం చేయడంతో ఎన్నికలను ఫిబ్రవరి 24న నిర్వహించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశించడం, ఎన్నికల షెడ్యూల్‌ను సైతం విడుదల చేయడం జరిగిందని, దీనికి భిన్నంగా వేరొక తేదీన ఎన్నికల నిర్వహణకు సంఘం నిర్ణయించడంతో ఎన్నికలు వివాస్పదమయ్యాయి. ఈ నెల 30న జనరల్ బాడీ మీటింగ్ నిర్వహిస్తామని ఈ నెల 25వ తేదీన సర్క్యులర్ జారీ చేశారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు గత రెండు నెలలుగా ప్రచారం సైతం చేశారు. ఈ నెల 30న జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లో అభ్యర్థుల పోటీ అర్హతపై నూతన నిర్ణయాలు తీసుకుని పలువురు అభ్యర్థులను పోటీకి అనర్హులను చేస్తారనే ప్రచారం జరుగుతోందని, పోటీ చేయడానికి సిద్ధమైన అభ్యర్థులు సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్షస్థానానికి పోటీచేస్తున్న సీనియర్ న్యాయవాది ఐ.ఎం అహ్మద్ లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. పిటీషన్‌పై ప్రాథమిక విచారణను సోమవారం లోక్ అదాలత్ చేపట్టే అవకాశం ఉందని పిటీషనర్ ఐ.ఎం అహ్మద్ తెలిపారు.

వేద ఘోషతో మార్మోగిన శారదాపీఠం

- అత్యంత ఘనంగా రెండో రోజు వేడుకలు
- పీఠాన్ని దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం : వేద ఘోషతో పెందుర్తి మండలం చినముషిడివాడలో విశాఖ శ్రీ శారదాపీఠం మార్మోగింది. ఐదు రోజులపాటు జరుగుతున్న పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. రథ సప్తమిని పురస్కరించుకుని అరుణ పారాయణం, సౌరయాగాన్ని విశేషంగా నిర్వహించారు. సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శత్రు నాశనం కోసం మన్యుసూక్త హోమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే రాజశ్యామల యాగం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. చాత్తాద వైష్ణవ ఆగమ సదుస్సును నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు సాయంత్రం శారదా స్వరూప రాజశ్యామల సమేత చంద్రమౌళీశ్వరుల పీఠార్చనను ఘనంగా చేపట్టారు. రాజశ్యామల అమ్మవారికి పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా, ఎమ్మెల్యే వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. అనంతరం వీరికి స్వామీజీలు ఆశీస్సులు అందజేశారు.



రాజశ్యామల వైభవం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి, చిత్రంలో శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు

రాజశ్యామల వైభవం గ్రంథావిష్కరణ

రాజశ్యామల అమ్మవారి ఉపాసనా కేంద్రం యావత్ భారతదేశంలోనే విశాఖ శారదాపీఠంలో ఉందని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఏనాడో చెప్పారని తెలిపారు. ఐదు రోజులపాటు జరుగుతున్న శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి పీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాత్రి వార్షిక మహోత్సవాల వేదికపై రాజశ్యామల వైభవం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ 14 సంవత్సరాలు హిమాలయాల్లో సంచరించినపుడు అమ్మవారు ఉపాసనా విధానాన్ని ఒక మహనీయుడు తమకు ఉపదేశించారని తెలిపారు. ఆ శక్తితోనే హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే పీఠంగా విశాఖ శారదాపీఠం పేరు గడించిందని తెలిపారు. కలియుగంలో ఇప్పుడున్న పరిస్థితిల్లో పరాశక్తి స్వరూపమైన అమ్మవారి ఆవశ్యమని తెలియజేశారు. తమ ఉపదేశం మేరకే గ్రంథ రచయిత సీతారామాంజేయశర్మ ఈ గ్రంథాన్ని ముద్రించారని తెలియజేశారు. కార్యక్రమంలో షట్‌శాస్త్ర పండితులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, చిర్రావూరి శ్రీరామ శర్మ, రామ్‌లాల్ శర్మ, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు.



పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్‌కి వీణను బహూకరిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి



స్వరూపానందేంద్ర సరస్వతికి కానుకలు అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా



బూడి ముత్యాలునాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

లోకేష్ పాదయాత్రతో టీడీపీ భూస్థాపితం



కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్

సాక్షి, విశాఖపట్నం: నారా లోకేష్ పాదయాత్రతో ఏపీలో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కానుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ అన్నారు. వన్‌టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ ఒక్కసారి కాదు.. వంద సార్లు పాదయాత్ర చేసినా ఎమ్మెల్యేగా గెలవలేడని ఎద్దేవా చేశారు. టీడీపీ ఇంటికో ఉద్యోగం.. ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాలు అంటూ హామీలు గుప్పించి.. ఒక్కటైనా నేరవేర్చిందా అని లోకేష్‌ను ప్రశ్నించారు. తండ్రీకొడుకులిద్దరూ అబద్ధపు హామీలతో నిరుద్యోగులు, యువతను మళ్లీ నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని.. పాదయాత్రలోనే యువత లోకేష్‌ను నిలదీయాలని పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో ముస్లిం, మైనారిటీలకు అడుగడుగునా ద్రోహం జరిగిందన్నారు. నారా హమారా కార్యక్రమంలో ప్రశ్నించిన ముస్లిం యువతపై దేశద్రోహం కేసులు పెట్టారని గుర్తు చేశారు. స్కిల్ ఏపీ పేరుతో చేసిన స్కాంను యువత మరిచిపోలేదన్నారు.

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఉక్కునగరం: మీడియం స్కేల్ మర్చంట్ ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)ల అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ కట్టుబడి ఉందని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉక్కు ఎంపీ హాలులో మొదటిసారిగా జాతీయ వెండర్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్–2023 నిర్వహించారు. ఈ సెమినార్‌లో ముఖ్య అతిథిగా సీఎండీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విక్రేతలతో గొప్ప సంబంధాన్ని కలిగి ఉందన్నారు. దిగుమతుల విడిభాగాల స్వదేశీకరణ అనేది విక్రేతలకు తక్షణమే అందుబాటులో ఉన్న చక్కటి అవకాశమన్నారు. స్వదేశీకరణ దిశగా తీసుకుంటున్న చర్యలు స్టీల్‌ప్లాంట్‌కు గణనీయమైన పొదుపునిచ్చాయన్నారు. ఇటు వంటి కార్యక్రమాలు ద్వారా స్టీల్‌ప్లాంట్, సరఫరాదారులు పరస్పరం వృద్ధి చెందుతారన్నారు. ఇరువురి మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి మాట్లాడుతూ విక్రేతదారులు సహేతంగా టెండర్ కోట్ చేయాలని, డెలివరీ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని సూచించారు. టెండరింగ్ ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను స్టీల్‌ప్లాంట్ కచ్చితంగా అనుసరిస్తుందన్నారు. ఎంఎస్‌ఎంఈ అదనపు డైరెక్టర్ జి.వి.ఆర్.నాయుడు మాట్లాడుతూ స్థానిక ఎంఎస్‌ఈలను ప్రోత్సహించడంలో స్టీల్‌ప్లాంట్ చొరవ అపూర్వమన్నారు. ఉక్కు ఎంఎం జీఎం కె.వి.ఎ.మురళీబాబు స్వాగతోపన్యాసం చేసిన కార్యక్రమంలో పలువురు విక్రేతలు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విక్రేతదారులకు సీఎండీ జ్ఞాపికలు అందజేశారు.



సమావేశంలో మాటాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

పారా అథ్లెట్లకు పతకాలు



విశాఖ స్పోర్ట్స్: జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖ అథ్లెట్లు సత్తా చాటి పతకాలు సాధించారు. గుజరాత్ రాష్ట్రంలో జరుగుతున్న ఈ పోటీల్లో వి.రవణి టీ11 కేటగిరీలో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్‌లో స్వర్ణాలు సాధించింది. ఇదే కేటగిరీలో సూర్య రోహిత్ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఎస్.మణికంఠ 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో విజేతగా నిలిచి స్వర్ణాలను అందుకున్నాడు. టీ 12 కేటగిరీలో స్వరాజ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, లాంగ్‌జంప్‌లో కాంస్యం సాధించాడు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ సామియ్యవలసలో శనివారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా తగిలాడ కనకరాజు(39) అనే తాపీమేస్త్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భవన నిర్మాణంలో భాగంగా పరంజి కట్టుకుని దానిపై నుంచి పని చేస్తుండగా.. పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కనకరాజుది భోగాపురం మండలం అక్కివరం. అతని భార్య పైడిరాజు ఫిర్యాదుతో ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారా లీగల్ వలంటీర్ల సేవలు కీలకం

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సేవలు అందించడానికి శనివారం పారా లీగల్ వలంటీర్లను ఎంపిక చేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.గోపి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి బులికృష్ణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వి.రవీంద్ర ప్రసాద్, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వల్లభ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయ సేవలు ప్రజలకు చేరువ కావడంలో పారా లీగల్ వలంటీర్ల సేవలు కీలకమన్నారు. ఎంపికైన వలంటీర్లు క్రమశిక్షణలో సేవలు అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గోపి

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు సైతం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. వైఎస్సార్ టీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావుకు శనివారం కమిటీ అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ అందజేశారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలపై ఆయన డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుతో విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఉపాధ్యాయ సంఘాల సహకారం అవసరమన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే రీతిలో డైరీ, క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని ఏపీసీ శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సురేష్, గోవింద్ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ తదితరులు

జనరల్ నోటీసు

నా క్లయింటు అయిన M/s. Honeyy Constructions represented by its Managing Partner Sri Mukka Obul Reddy గారు యిచ్చిన భోగట్టాపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని 1) శ్రీమతి **వానపల్లి వరలక్ష్మి**, W/o. లేటు కృష్ణారావు వారి సంతానం, 2) శ్రీమతి **చింతలపూడి సత్యవేణి**, 3) **వానపల్లి గురుప్రసాదరావు**, 4) **వానపల్లి ఆనందరావు**, 5) శ్రీమతి **జల్లా శ్రీదేవి**, 6) శ్రీమతి **వానపల్లి దివ్యప్రభ** గారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు అగ్రిమెంటు పొందియున్నారు. సదరు ఆస్తిని శ్రీ వానపల్లి కృష్ణారావు గారు దాక్యుమెంటు నెం. 11192/82 రు ద్వారా Srinivasa co-operative House Building Society Ltd., వారి వద్ద నుండి కొనుగోలు చేసియుంటిరి. సదరు కృష్ణారావు గారు వారి జీవితకాలంలో ఎటువంటి లిఖితపూర్వకమైన వీలునామాలు వ్రాయకుండా తే. 27.02.2018న మరణించియున్నారు. వారికి పైన ఉదహరించిన వారి భార్య వరలక్ష్మి గారు మరియు సత్యవేణి, గురుప్రసాదరావు, ఆనందరావు, శ్రీదేవి, దివ్యప్రభ గార్లు తప్ప వేరే వారసులు ఎవ్వరు లేరని తెలిపియుంటిరి. ఈ ఆస్తిపై ఎటువంటి అన్యాక్రాంతములు చేయలేదని తెలిపియుంటిరి. కావున ఈ ఆస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ క్రింది చిరునామాకు ఏడు దినములలో తెలియపర్చవలెను. అట్లు కానిఎడల ఎవరికి ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుదురు.

షెడ్యూలు

విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషను పరిధిలో గల మాధవధార గ్రామం, సర్వే నెం. 48/4 Partలో గల ప్లాటు నెం. 46గా గల చ॥గ॥ 267లు స్థలంనకు **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం. 47, **దక్షిణం:** 30 అడుగుల రోడ్డు, **పడమర:** ప్లాటు నెం. 45, **ఉత్తరం:** ప్లాటు నెం. 41

A. PRASADA RAO, I.S.K. SATYAVENI
A. RAJESH & G. ALEKHYA, Advocates
D.No. 50-50-33/2/1, B.S.Layout, NH-5 Road, Visakhapatnam. Ph: 98491 21666

విశాఖపట్నం
తేది: 28-01-2023

చెరువు.. అన్యాక్రాంతం

పద్మనాభం: తరతరాలుగా వంద ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందిస్తున్న చెరువును జిరాయితీగా మార్చి బడాబాబులు ఆక్రమించుకోవడంతో రైతులు మండిపడుతున్నారు. పొట్నూరులోని ఈ చెరువుకు సంబంధించిన రికార్డులు ట్యాంపరింగ్ చేసి మరీ తమ వశం చేసుకున్న ఉదాంతం వారిలో ఆందోళన కలిగిస్తోంది. పొట్నూరు సర్వే నంబర్ 107లో 19.70 ఎకరాల విస్తీర్ణంలో గవర్రాజు చెరువు ఉంది. ఈ చెరువు కింద సుమారు 100 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ భూమిని విజయనగరం జిల్లా జామి మండలం కుమరాంనకు చెందిన రైతులు శతాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. 150 మంది రైతులు ఇక్కడ సాగు చేసుకుంటూ వచ్చిన ఫలసాయంతో జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చెరువుపై బడాబాబుల కన్ను పడింది. దీన్ని ఎలాగైనా తమ వశం చేసుకోవాలని అక్రమ పద్ధతులకు తెరతీశారు. ఈ చెరువు గర్భంలోని 10 ఎకరాలు ఓ వ్యక్తి పేరు మీద, ఎకరం విస్తీర్ణాన్ని మరొక వ్యక్తి పేరు మీద రెవెన్యూ అధికారులు 1 బీలో నమోదు చేశారు. డిసెంబర్‌లోనే గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారమంతా జరిగినట్టు రైతులు తెలిపారు. ఈ చెరువులో మూడేళ్ల పాటు ఉపాధి హామీ పనులు చేపట్టారు. కాగా.. ఈ నెల 25న ఆక్రమణదారులు కూలీలను పంపించి ప్రొక్లెయిన్‌తో చెరువు చదును చేయిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. దీంతో కూలీలు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమనిగింది. అప్పటి నుంచి రైతులు చెరువు కబ్జాను అడ్డుకోవడానికి కాపలాగా ఉంటున్నారు. బడాబాబులు చెరువు గర్భాన్ని సాగు భూమిగా మార్చుకుంటూ పోతే చెరువు కుచించుకుపోయి ఆయకట్టుకు సాగు నీరందక బీడు భూమిగా మారే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కబంధ హస్తాల్లోకి వెళ్లకుండా చెరువును కాపాడుకుంటామని స్పష్టం చేస్తున్నారు.



పొట్నూరులోని గవర్రాజు చెరువు

ఆయకట్టుకు సాగు నీరు ప్రశ్నార్థకం



గవర చెరువు చెరువు కింద నాకు 60 సెంట్ల భూమి ఉంది. చెరువును ఆక్రమిస్తే.. మా భూములకు సాగు నీరు అందక పంటలు పండవు. జీవనోపాధి కోల్పోతాం.

– జంకల సన్యాసప్పుడు, రైతు, కుమరాం

జీవనోపాధికి విఘాతం



ఈ చెరువు కింద నాకు 70 సెంట్ల భూమి ఉంది. చెరువు గర్భాన్ని సాగు భూమిగా మార్చుకుంటే.. మా భూములకు సాగు నీటి కొరత ఏర్పడుతుంది. పంటలు పండక జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతాం. చెరువుపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నాం.

– ఇప్పలి రామునాయుడు, రైతు, కుమరాం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. రికార్డులు పరిశీలించి చర్యలు చేపడతాం. రైతులకు న్యాయం చేస్తాం.

– కె.వేణుగోపాలరావు, ఇన్‌చార్జి తహసీల్దార్

చెరువుగానే ఉంటుంది



గవర్రాజు చెరువు రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పొట్నూరులోని గవర్రాజు చెరువు గర్భానికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన పేర్లను తొలగిస్తామని భీమునిపట్నం ఆర్డీవో భాస్కరరెడ్డి ఆయకట్టు రైతులకు హామీ ఇచ్చారు. చెరువును శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెలలో పొట్నూరులో భూముల రీ సర్వే చేయనున్నట్టు తెలిపారు. రీ సర్వేలో గవర్రాజు చెరువును.. చెరువుగానే పరిగణిస్తామన్నారు. అంతకుముందు ట్యాంపరింగ్‌కు గురైన రేవిడి యాతవాని చెరువును పరిశీలించారు. దీనికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ వేణుగోపాలరావు, డీటీ కిశోర్‌కుమార్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు



తుపాకుల రాఘవరెడ్డి



కుప్ప అప్పల నారాయణ



బుత్తల సాయి చరణ్

తగరపువలస: కర్నూలులో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు భీమిలి మండలం లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 10వ తరగతి విద్యార్థులు తుపాకుల రాఘవరెడ్డి, కుప్ప అప్పలనారాయణ, 9వ తరగతి విద్యార్థి బుత్తల సాయిచరణ్ ఉన్నారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులు తమకు గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు సంతోషం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.లలిత్‌కుమార్, ఉపాధ్యాయులు బషీర్‌ఖాన్, నీలంరెడ్డి, అంబిక, పైడినాయుడు, నిత్యానంద్, నరసింహం, శ్రీనివాస్, లక్ష్మి, సుందరి విద్యార్థులను అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో పల్లవికి స్వర్ణం



విశాఖ స్పోర్ట్స్: ఆల్‌ఇండియా ఇంటర్‌వర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పల్లవి స్వర్ణం సాధించింది. కాలికట్ యూనివర్సిటీలో ఈ పోటీలు నిర్వహించగా ఏయూ తరఫున ఆమె పాల్గొంది. పల్లవిని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.